సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం ♦ 10 ♦ జూన్ ♦ 2025



కాపాడుతారా.. వదులుకుంటారా!

మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన మిషన్ కాంపౌండ్ ముఖద్వారం ఎదురుగా ఉన్న..రూ.కోట్ల విలువైన భూమిని అధికారులు కాపాడుతారా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. - 8లో



త్వరలో 32వేల మందితో యోగా

ఆసనాలు వేస్తే అందరి జీవితాలు ఆరోగ్యపరంగా మెరుగుపడతాయని కలెక్టర్ శ్రీధర్ ఎర్కొన్నారు. అన్నమయ్యవిగ్రహం వద్ద వందలాది మందితో యోగాంధ్ర నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.272
రెండోరకం	రూ.150	రూ.210



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1004 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	535
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 554.220 కిలోలు

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



ప్రజల సమస్యలను వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకొని సత్వరం న్యాయం చేస్తామన్నారు. గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లి నుండి ఇడగొట్టి పుష్పలత, చిన్నమండెం నుండి పఠాన్ అమీరుల్లాఖాన్‌లు నడవలేని పరిస్థితిలో తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ వారివద్దకే వెళ్లి సమస్య విన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చట్ట పరిధిలో వీటిని పరిష్కరించాలని గుర్రంకొండ,చిన్నమండెం ఎస్ఐలను ఆదేశించారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 పురుషుల వన్డే క్రికెట్ మ్యాచ్‌లు నేటి నుంచి ఈ నెల 16వతేదీ వరకు కడపలోని వైఎస్ఆర్ఆర్ -ఏసీఏ క్రికెట్ స్టేడియం, కెఎస్ఆర్ఎం, కెఓఆర్ఎం మైదానాల్లో జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ప్రసాద్ సోమవారం తెలిపారు. కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జట్లు పోటీల్లో తలపడతాయన్నారు.

ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరి విడనాడాలి

కడప ఎడ్యుకేషన్ : ఎస్జీలటీకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే విషయంలో ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరి విడనాడాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వెబ్ కౌన్సెలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సెలింగ్ ముద్దు అనే నినాదంతో ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులో దాదాపు 500 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా 25 మంది నాయకులు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తన తీరు ఇప్పటికైనా మార్చుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. పెద్ద ఎత్తున అన్ని జిల్లాల్లో డీఈఓ కార్యాలయాల ముట్టడి జరిగినప్పటికీ ప్రభుత్వంలో కానీ, అధికారుల్లో కానీ ఎలాంటి చలనం రాకపోవడం దారుణం అని విమర్శించారు.

ఏడాది..అభివృద్ధికి సమాధి!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క పంచాయతీరాజ్‌శాఖ పథకాల ద్వారా మంజూరైన పనులు రూ.1,163 కోట్లు
- అందులో రూ.458 కోట్లు నిలిపివేశారు
- మొదలుపెట్టి ఆగినవి రూ.316 కోట్లు
- పనులు ప్రారంభం కావాల్సినవి రూ.142 కోట్ల పనులు
- తాగునీటి పథకాలపైనా అక్కసు..



నిధులు మంజూరైనా చేపట్టని బి.కొత్తకోట బీరంగి ఏటిపై బ్రిడ్జి పనులు

మదనపల్లె : ఏ ప్రభుత్వమైనా ప్రజల కష్టాలు తీర్చేలా, సౌకర్యాలు కల్పించడం కోసం అభివృద్ధికి పెద్దపీట వేయాలి. గత వైఎస్సార్‌సీపీ జిల్లా అభివృద్ధి కోసం ఇదే పని చేసింది. ఒకటి రెండు కాదు వేల కోట్లతో పనులు మంజూరు చేసింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని కొసాగించి ప్రజల కష్టాలను దూరం చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. మంజూరైన పనుల్లో 25శాతం మించలేదన్న సాకుతో అందుబాటులోని నిధులను సద్వినియోగం చేసుకోకుండా ఏకం రద్దు చేసేసింది. దీంతో జిల్లా ప్రజల వందల కోట్ల అభివృద్ధి దూరమయ్యారు. ఫలితం మళ్లీ ఇవే పనులను కూటమి ప్రభుత్వం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో అభివృద్ధి పనులే కాదు తాగునీటి కోసం మంజూరు చేసిన పనులను కక్షకట్టి అడ్డుకుంది కూటమి ప్రభుత్వం. దీంతో గ్రామీణులు తాగునీటి ఇబ్బందులను తీర్చలేని దుస్థితి నెలకొంది.

పీఆర్‌లో రూ.678 కోట్ల పనులు

2019-2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వివిధ పథకాలు, గ్రాంట్లు కింద రూ.1,163 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో మారుమూల పల్లెల్లో అభివృద్ధి పనులే కాకుండా పల్లెలకు అవసరమైన మౌలిక వసతులైన సిమెంటురోడ్లు, మురికినీటి కాలువలు, కల్వర్టులు, తారురోడ్లు. ప్రహరీగోడలు, ఇంటర్నల్ సీసీరోడ్లు, అప్రోచ్‌రోడ్లు, ప్రభుత్వశాఖల భవనాలు.. ఇలా వివిధ పనులకు నిధులు మంజూరు చేసి కేటాయించింది. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు చేపట్టారు. గత ప్రభుత్వాల్లో జరగనంత అభివృద్ధి మొదలైంది. ప్రభుత్వ పాలన పల్లె ముంగిటకు వచ్చేసింది. పాలనా వికేంద్రీకరణతో ప్రజలు మండల కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా చేశారు. విద్య, వైద్యం కూడా అందుబాటులోకి వచ్చింది. మంజూరైన ఈ నిధుల్లో 2024 జూన్ నాటికి రూ.678 కోట్ల అభివృద్ధి పనులను అధికారులు పూర్తి చేయించారు. మిగిలినవి పూర్తి చేసేలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

రూ.458 కోట్ల పనుల నిలిపివేత

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని వివిధ పథకాల కింద మంజూరైన నిధుల్లో రూ.458 కోట్ల పనులను అడ్డుకుని నిలిపివేసింది. ఇందులో మొదలుపెట్టిన పనుల్లో రూ.316 కోట్ల పనులు ఆగిపోయాయి. రూ.142 కోట్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇందులో సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, ఆర్‌బీకేలు, రహదారులు, సిమెంటురోడ్లు ఇలా గ్రామీణ ప్రాంతాలకు కల్పించాల్సిన సౌకర్యాలు ఎన్నో ఉన్నాయి.

రూ.382 కోట్ల తాగునీటి పనులు రద్దు

కూటమి ప్రభుత్వంలో జిల్లాలో గ్రామీణ ప్రజలకు తాగునీటిని అందించాలని మంజూరు చేసిన పథకాలపైనా అక్కసు వెళ్లగక్కింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో తాగునీటికి సంబంధించిన పనులు చేపట్టి, ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.382.48 కోట్ల విలువైన 4,709 పనులు చేపట్టింది. ఈ పనులు చేపడుతుండగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం 25శాతానికి మించి పనులు జరగలేదన్న నెపంతో వీటిని రద్దు చేసింది. ఈ పనుల స్థానంలో మళ్లీ కొత్త పనులు తీసురాకపోవడంతో గ్రామీణ ప్రజలకు తాగునీటి సౌకర్యాలను అందిచడంలో విఫలం అవుతోంది.

సిమెంటురోడ్లపైనా కక్ష

కూటమి ప్రభుత్వంపై తంబళ్లపల్లె నియోజకవర్గంపై ప్రత్యేకంగా కక్ష కట్టింది. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గానికి 223.11 కిలోమీటర్లతో 1,875 సిమెంటురోడ్లను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంజూరు చేయించారు. దీనికోసం ప్రభుత్వం రూ.70.35 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.21.12 కోట్లు ఖర్చు చేసి 64.65 కిలోమీటర్ల మేర 581 పనులు పూర్తి చేయగా, మిగిలిన 158.46 కిలోమీటర్ల 1,294 పనులను రద్దు చేసింది.

మదనపల్లెలో రూ.5.33 కోట్లు పనులు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మదనపల్లె సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటీకి గత ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. వీటిని సద్వినియోగం చేసుకుని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా రూ.5.33 కోట్ల విలువైన 101 పనులను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో పట్టణ ప్రజలకు మౌలిక వసతులకు కల్పించలేని పరిస్థితి నెలకొంది.

స్థలదాతకే కష్టం

పెద్దతిప్పసముద్రం మండలం నవాబుకోటలో సచివాలయ భవనం నిర్మాణానికి స్థలం లేకపోవడంతో మాజీ సర్పంచ్ గిరీశం స్థలదానం చేశారు. రూ.35 లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులను ఆయనే చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం రాకతో బిల్లులు ఆగిపోవడంతో రూ.7 లక్షలు ఆగిపోయాయి. బిల్లులు అందక దాతకే కష్టం వచ్చింది.

ఏడాదిలో ఆపేసిన పీఆర్ పనులు

పథకం	పనులు	నిధులు (కోట్లలో)
ఎన్ఆర్‌జీఎస్	177	రూ.9.91
ఈఏపీ	23	రూ.28.23
జీజీఎంపీ	647	రూ.15.76
ఎంపీల్యాడ్స్	82	రూ.3.43
సీఎస్ఆర్	33	రూ.1.70
పీఎంజీఎస్‌వై	6	రూ.10.45
బీఎంసీయూ	169	రూ.27.99
ఎన్ఆర్‌జీఎస్	32	రూ.2.91
డీఎంఎఫ్	17	రూ.1.46
సీఎండీఎఫ్	1	రూ.0.05
పిఆర్ఆర్	1	రూ.1.00
డిజిటల్ లైబ్రరీ	206	రూ.32.96
మిగిలినవి	20	రూ.6.20

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఆర్ శాఖకు చేపట్టినవి

- మంజూరైన అభివృద్ధి పనులు : 4,910
- మొత్తం నిధులు : రూ.1,163.36 కోట్లు
- పూర్తిచేసిన పనులు : 2,541
- పనులకు చేసిన వ్యయం : రూ.678.76 కోట్లు
- మధ్యలో ఆగిపోయిన పనులు : 843
- ఆగిన పనుల విలువ : రూ.316.76 కోట్లు
- ప్రారంభానికి నోచుకోనివి : 1,514
- వీటి విలువ : రూ.142.10 కోట్లు

కంకర వేశాక ఆపేశారు



తంబళ్లపల్లె నియోజకవర్గంలో కంకర వేశాక ఆపేసిన రోడ్డు పని

తంబళ్లపల్లె నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.388.03 కోట్లతో 665.145 కిలో మీటర్ల 355 మట్టిరోడ్లను తారురోడ్లుగా మార్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో మంజూరు చేశారు. ఇందులో 257 రోడ్లను తారురోడ్లుగా పనులు పూర్తి చేశారు. మిగిలిన పనుల్లో రూ.70 కోట్ల విలువైన 77 రహదారుల పనులు చేపట్టాక కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షకట్టి నిలిపివేయించింది. దీంతో కంకర పరచి వదిలేసిన రోడ్లు కనిపిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందులున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అలాగే టెండర్లు పూర్తయిన రహదారుల నిర్మాణాలు, బ్రిడ్జిల పనులను నిలిపివేశారు. పదులసంఖ్యలో రహదారుల పనులు ఆగిపోయాయి. కంబాలపల్లె, టీ.సదుం బ్రిడ్జిలు, బడికాయలపల్లె రహదారి పనులు ఆగిపోయాయి. వీటన్నింటికి నిధులు మంజూరై టెండర్లు కూడా పూర్తయ్యాయి.

రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోంది

- కొమ్మినేని అరెస్టు కుట్రపూరితం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో ఆటవికపాలన జరుగుతూ రోజురోజుకు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మాత్రమే ఇలాంటి అరాచక పాలన, చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమాలు అమలు చేయకుండా రెండు, మూడు నెలలకు ఒకసారి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు వెన్నుపోటు పొడవడమే అన్నారు. కక్ష సాధింపు పరిపాలన ఎక్కువ కాలం కొనసాగించలేమని చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. సైన్స్ ఆఫ్ ఇండియా సుధీర్ రెడ్డితోపాటు కృష్ణంరాజును విచారించకుండానే కేవలం సాక్షిపై కక్ష కట్టడం నీచరాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఏబీఎన్, టివి-5లలో జగన్ కుటుంబంపై ఎన్నో అవాకులు చవాకులు మాట్లాడుతున్నప్పటికీ చర్యలు లేవా అని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఐఏఎస్‌లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అనవసరమైన కేసులతో జైలులో పెడుతున్నారని, వ్యవస్థలను మేనేజ్‌చేసే చంద్రబాబు రాజ్యాంగ విలువలను పాటించడం లేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, క్షమించరని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా, పుల్లంపేటకు చెందిన సుదర్శన్ రెడ్డిపై కొందరు దాడి చేస్తే వారిపై కేసులు పెట్టకుండా కేవలం సుదర్శన్ రెడ్డిపై కేసులు పెట్టడం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల నాగేంద్ర, సర్పంచ్ హరికృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రాజు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షిపై దాడి అప్రజాస్వామికం



కడప సాక్షి కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో సిబ్బంది నిరసన



కడప డీఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసేందుకు వేచి ఉన్న సాక్షి కడప యూనిట్ ప్రతినిధులు

కడప అర్బన్: కడప సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా, దాడి చేయడం అప్రజాస్వామికమని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాక్షి బ్రాంచ్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ వెన్ను శ్రీనివాసరావు, స్టాఫ్ రిపోర్టర్ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కడపలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లును వారు కలిసి వినతి పత్రం అందజేశారు. సాక్షి టీవీలో సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను వెంటనే కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించి క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. అయినా టీడీపీ నాయకులు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయం వద్ద ఆందోళనలు చేయాలని పిలుపునివ్వడం దారుణమని అన్నారు. కడపలో సాక్షి కార్యాలయంలోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించిన టీడీపీ దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. టీడీపీ నాయకులు చేసిన హంగామా సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, ప్రత్యక్ష సాక్షులు సైతం ఉన్నారన్నారు. ఈక్రమంలో కడపలోని డీఎస్పీ కార్యాలయంలోకి కేవలం ఇద్దరిని మాత్రమే అనుమతించారు. వినతిపత్రం ఇచ్చే సమయంలో ఫొటోను తీసుకునేందుకు కూడా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది అనుమతించకపోవడం గమనార్హం. సాక్షి కార్యాలయం వద్ద దాడులకు సంబంధించి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోని సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. సాక్షి దినపత్రిక సభ్యులు, సాక్షి టీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

సాక్షి కార్యాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ కడపలోని కడప- పులివెందుల రహదారిలో చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సాక్షి యూనిట్ కార్యాలయం సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అన్ని విభాగాల సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన చేపట్టారు.ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు మంచిది కాదన్నారు.

అడగండి..అడుగేయండి..!

- బడుల్లో జోరుగా ప్రవేశాలు
- విద్యార్థుల తల్లిదండ్రులూ..జాగ్రత్త



మదనపల్లె సిటీ : తమ పిల్లల చదువు కోసం ఎంత ఖర్చయినా వెనుకాడటం లేదు తల్లిదండ్రులు.జూన్‌లో బడులు పునః ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ప్రైవేటు బడులవారు ప్రవేశాల కోసం హంగు ఆర్భాటాలతో జోరుగా ప్రయత్నిస్తున్నారు. ఉపాధ్యాయులను ఇళ్లకు పంపుతూ పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు.జిల్లాలో ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేటలతో పాటు పట్టణాలలో కార్పొరేట్ సంస్కృతి పాకింది ప్రవేశాల నేపథ్యంలో తల్లిదండ్రులు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం...

గుర్తింపు ఇలా తెలుసుకోండి....

పాఠశాల తన వివరాలను విద్యాశాఖ కార్యాలయంలో రిక్నగైజ్ కోసం నమోదు చేయాలి. ఇలా చేస్తే వారికి నిర్దిష్ట క్రమసంఖ్య, నమోదైన సంవత్సరంతో కూడిన పత్రాన్ని ఇస్తారు. దీనిని బడుల వద్ద ప్రదర్శించాలి. దీనిని పరిశీలించాకే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలి. విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనూ గుర్తింపు పొందిన పాఠశాలల వివరాలను ప్రదర్శిస్తారు. డీఈవో, జిల్లా పేరు నమోదు చేసి అందులో వివరాలను తెలుసుకోవచ్చు.కొందరు 1-7 వతరగతి వరకు అనుమతి పొంది 8-10 తరగతులు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. ఎంఈవో లేదా విద్యాశాఖ కార్యాలయంలో సమాచారం పొందవచ్చు.

అర్హులు ఉన్నారా...?

అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారా అని తెలుసుకోవాలి. బీఈడీ, డీఈడీ చదివిన వారు బోధిస్తున్నారా లేదా ఆరా తీయాలి. ఉపాధ్యాయులు అర్హతలు కలిగిన వివరాలను బడుల్లో బోర్డుపై పరిశీలించాలి. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా ఉపాధ్యాయుల వివరాలను నోటీసు బోర్డుపై నమోదు చేయాలి.

తరగతి గదులు...మైదానం:

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదే. అనేక స్కూళ్లల్లో పిల్లలు కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేయక నేలపైనే చదువులు సాగిస్తున్నారు. డెస్క్ బల్లలు, ఫ్యాన్లు,లైట్లు, తాగునీరు, డైనింగ్‌హాల్ తదితర వసతుల కల్పన ముఖ్యం. జిల్లాలో ప్రైవేటు బడుల్లో ఎక్కువ శాతం మైదానాలు లేవు. విద్యతో పాటు క్రీడలను అదనంగా అర్హతలుగా పరిగణించాలి. ప్రతి స్కూల్‌లో మైదానం ఉండాలి. ప్రత్యేక వ్యాయామ పాధ్యాయులను నియమించాలి. ఈ విషయమై యాజమాన్యాల వద్ద తల్లిదండ్రులు వివరాలు కోరాలి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడల్లో రాణించిన బడుల్లో విద్యాబోధన ఎలా ఉందనే విషయాన్ని ఆరా తీయాలి.

గత ఫలితాలు ..సరళి ముఖ్యం:

ఐదేళ్లలో ఉన్నత బడుల్లో ఫలితాల సరళిని పరిశీలించాలి. కొన్ని పాఠశాలల్లో ఫలితాలు ఆశించిన మేర రాకున్నా ఆర్భాటం ఎక్కువ చేసి ప్రవేశాల విషయంలో తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేస్తారు. మెరుగైన ఫలితాలతో పాటు సాంస్కృతిక అంశాలను పరిశీలించాలి. ఏయే కార్యక్రమాల్లో అధిక శాతం విద్యార్థులు భాగస్వాములవుతున్నారో తెలుసుని నిర్ణయం తీసుకోవాలి.

గ్రంథాలయాలు:

ప్రాథమిక స్థాయి నుంచి పఠనాసక్తి కలిగించాలి. ఆ దిశగా యాజమాన్యాలు పరిస్థితులు కల్పించాలి. ఒక స్కూల్‌లో ఏర్పాటు చేసిన పుస్తకాల్లో కథలు, సంస్కృతి అంశాల చరిత్ర, పోటీ పరీక్షలకు ఉపయోగపడే సమాచారం అందుబాటులో ఉంచాలి.అయితే యాజమాన్యాలు ఎక్కడా కూడా గ్రంథలయాలు ఏర్పాటుపై దృష్టి పెట్టడం లేదు. ఈవిషయంలో తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇన్నోవేటివ్ అంశాలు:

పాఠశాలలో ఇన్నోవేటివ్ అంశాలు నేర్పిస్తున్నారా? కొత్త విషయాన్ని పిల్లలకు తెలిపేందుకు యాజమాన్యాలు పాటుపడుతున్నాయా అనే వివరాలు తెలుసుకోవాలి. గతంలో వైజ్ఞానిక ప్రదర్శనలు,ఇన్‌స్పైర్‌మనక్, సైన్స్ మేళాల్లో పాల్గొన్న విద్యార్థుల వివరాలను గమనించాలి. ప్రతిభ చాటే వారిని ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారో ఆరా తీయాలి.

గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించాలి



పిల్లలను గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించాలి. పాఠశాల వివరాలు తెలుసుకున్న తర్వాత నిర్ణయం తీసుకోవాలి. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉంటేనే చేర్పించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి.

– ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె.

క్లుప్తంగా

భార్యపై కత్తితో దాడి


గాయపడిన హరిణి

రాజంపేట : తాళ్లపాక చెరువుకట్ట వద్ద సోమవారం రామయ్య అనే వ్యక్తి తన భార్య హరిణిపై కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం జరిగింది. ఈ దాడిని స్థానికంగా ఉన్న యువకులు అడ్డుకున్నారు. అయితే అప్పటికే కత్తిపోట్లకు గురైన హరిణికి తీవ్ర రక్తస్రావమైంది. ఆమెను రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. భార్యాభర్తల మధ్య వివాదాలే కారణమని స్థానికుల సమాచారం. ఈ సంఘటనపై మన్నూరు సీఐ కుళాయప్ప దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ కేసు నమోదు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురంలోని ఖాజా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ సందాని బాషా, ట్రస్టు సభ్యుడు షేక్ తాహీర్ ఆలీ పై పోలీసులు ఫోర్జరీ నేరం కింద కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ సందాని బాషా అధ్యక్షుడుగా 2012లో ఏర్పాటు చేసిన ఖాజా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీలో తమకు ఏ మాత్రం సమాచారం లేకుండా సభ్యులుగా పేర్కొన్నారని, తమ సంతకాలను ఫోర్జరీ చేసి సొసైటీలో అక్రమాలకు పాల్పడినట్లు పట్టణానికి చెందిన షెహనాజ్ ఫాతిమా వాల్మీకిపురం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనను కోశాధికారిగానూ, తన తోడికోడలు షేక్ గౌసియా బేగంను సభ్యురాలుగా రిజిస్టర్ చేయించారని తెలిపారు. తమ సంతకాలు ఫోర్జరీ విషయమై చట్టపరమైన చర్యల కోసం కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకుల కబ్జాను అడ్డుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఓబులవారిపల్లె : బాలాజీ నగర్ ఎస్టీ యానాదులకు కేటాయించిన స్మశాన భూమిని తెలుగుదేశం పార్టీ నాయకులు రోడ్డు పేరుతో కబ్జాలకు పాల్పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి సుజాతకు వినతిపత్రం అందజేశారు. వెంటనే కబ్జాలను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మల్లిక, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కాపాడుతారా.. వదులుకుంటారా!

- రూ.కోట్ల విలువైన భూమిపై అధికారుల చర్యలే కీలకం
- ఆ బందెలదొడ్డికి రూ.499 పన్ను చెలిస్తున్నది మున్సిపాలిటీనే
- ప్రైవేటు వ్యక్తులకు ఆ భూమి ఎలా సంక్రమించిందో తేల్చాలి


బందెలదొడ్డి భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీ, గేటు ఏర్పాటు

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన మిషన్ కాంపౌండ్ ముఖద్వారం ఎదురుగా ఉన్న రూ.కోట్ల విలువైన భూమిని అధికారులు కాపాడుతారా లేక వదులుకుంటారా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన బందెలదొడ్డి భూమిని దశాబ్దాలుగా చూస్తున్నాం..అది మున్సిపాలిటీకి చెందిన ఆస్తి.. ఇది ప్రైవేటు ఆస్తి ఎలా అవుతుందని చర్చించుకుంటున్నారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'దర్జాగా బందెలదొడ్డి కబ్జా' కథనం పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకుంటే గంటల్లో సమస్య పరిష్కారమై మున్సిపల్ ఆస్తి కాపాడుతారా, లేకపోతే వివాదం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు సహకరించి ఏళ్ల తరబడి సాగదీస్తారా అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పట్టణంలో కోట్ల విలువైన మున్సిపాలిటీ ఆస్తులను రక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, లేదా అక్రమార్కులకు సహకరించడం లాంటి చర్యలతో అన్యాక్రాంతం అయ్యాయి. ఇప్పుడు బందెలదొడ్డి భూమి వంతు వచ్చింది.

ముమ్మాటికి మున్సిపాలిటీదే..

మిషన్ కాంపౌండ్ ఎదురుగా ఉన్న బందెలదొడ్డి భూమి ముమ్మాటికి మున్సిపాలిటీకి చెందిందేనని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పష్టం చేస్తున్నారు. సర్వే నంబర్ 206లోని ఈ భూమికి బందెలదొడ్డి పేరుతో రూ.499 పన్ను కూడా వస్తోందని పట్టణ ప్రణాళికశాఖ అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. అలాంటప్పుడు ఇది ప్రైవేటు ఆస్తి ఎలా అవుతుందన్నది అధికారులు కూడా పరిశీలించాలి.

పత్రాలు సరే..హక్కు ఎలా వచ్చింది?

సర్వే నంబర్ 206లోని 1, 3వ లెటర్‌లోని భూమి తమదని కొందరు సోమవారం మున్సిపల్ అధికారులను కలిసి రికార్డులు అందించారు. కుటుంబ పెద్ద.. బిడ్డలకు ఇచ్చినట్టుగా ఆ పత్రాల్లో ఉన్నట్టు అధికారులు చెప్పారు. ఈ సర్వే నంబర్‌లోని భూమి ఎక్కడుంది, ఆ భూమి బందెలదొడ్డి భూమేనా, లేక మరోచోట ఉందా అన్నది కూడా తేలాలి. బిడ్డలకు భూమి ఇచ్చిన వ్యక్తి ఎవరి నుంచి కొనుగోలు చేశారు, ఆ విక్రయించిన వ్యక్తికి ఎలా హక్కు వచ్చింది, ఇది ప్రైవేటు భూమినా లేక మున్సిపల్ భూమినా అన్నదానిపై విచారణ చేయాల్సి ఉంది. బెంగళూరులో ఉంటున్న ఓ వ్యక్తి పేరుతో ఈ భూమి ఉందని ఆదివారం విచారణకు వెళ్లిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారికి అక్కడివాళ్లు చెప్పారు. ఆ వ్యక్తి అధికారుల వద్దకు వస్తే భూమికి హక్కు ఎలా వచ్చిందో తెలుస్తుంది.

కలెక్టర్ స్పందిస్తేనే పరిష్కారం..

మదనపల్లెలో భూ ఆక్రమణలు, భూ దందాలపై సీరియస్‌గా స్పందించి అప్పటికప్పుడే చర్యలు చేపట్టి పరిరక్షించేందుకు కలెక్టర్ శ్రీధర్ కృషి చేస్తున్నారు. ప్రస్తుతం బందెలదొడ్డి భూమి విషయంలో కలెక్టర్ స్పందిస్తే సత్వర పరిష్కారం లభించి మున్సిపల్ ఆస్తికి రక్షణ కలుగుతుంది. లేకపోతే స్థానిక అధికారుల్లో ఆ తీవ్ర ఉండదు. తీవ్ర జాప్యం, చర్యలపై నిర్లక్ష్యంతో సమస్యను జటిలం చేసి చేతులు దులుపుకునే అవకాశం ఉంది. కలెక్టర్ స్పందిస్తే అధికారులు కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉంటుంది.

ఆపమన్నా ఆపలేదు..

బందెలదొడ్డి భూమిలో ఆదివారం శరవేగంగా పనులు చేశారు. రహదారి కాలువపై బండలు పరచి మూసివేశారు. చుట్టూ సిమెంటు దిమ్మెలతో ప్రహరీ నిర్మించారు. మధ్యలో టిప్పర్లతో మట్టిని తరలించి నింపుతున్నారు. ఆదివారం సాయంత్రం దీన్ని పరిశీలించిన టీపీఓ రెడ్డెమ్మ ఇది బందెలదొడ్డి ఇందులో పనులు ఆపివేయాలని అక్కడివారిని హెచ్చరించి వచ్చేశాక రాత్రి చుట్టూ ప్రహరీ ఎత్తును పెంచేశారు.

సమగ్ర సర్వేకు చర్యలు

సాక్షిలో సోమవారం 'దర్జాగా బందెలదొడ్డి కబ్జా' శీర్షికన ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ కె.ప్రమీల పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ రికార్డుల్లో సర్వే నంబర్ 206లో బందెలదొడ్డి భూమికి మున్సిపాలిటి పన్ను కూడా విధించిన రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. బందెలదొడ్డి భూమి తమదని కొందరు రికార్డులు ఇచ్చారని, అందులోని సర్వే నంబర్ భూమి, మున్సిపాలిటీ బందెలదొడ్డి భూమి, విస్తీర్ణంపై సర్వే చేశాక వాస్తవాలను తేల్చుతామని కమిషనర్ ప్రమీల తెలిపారు.

ఒంటిమిట్ట రామాలయం వద్ద అగ్ని ప్రమాదం


ఒంటిమిట్ట రామాలయం వద్ద అగ్ని ప్రమాద దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల మేరకు రామాలయం దక్షిణం వైపు గల సీఎం గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న మొబైల్ మరుగుదొడ్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. నిరుపయోగంగా పడి ఉన్న మొబైల్ మరుగుదొడ్లను టీటీడీ ఆదేశాల మేరకు వెల్డింగ్ సహాయంతో కత్తిరించి వాటిని తిరుమల డీపీడబ్ల్యు స్టోర్‌కు తరలించాలని ప్రయత్నిస్తుండగా వెల్డింగ్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మొబైల్ మరుగుదొడ్లకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. గమనించిన టీటీడీ విజిలెన్సు విభాగం సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే మొబైల్ మరుగుదొడ్లు పూర్తిగా కాలిపోయాయి. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెల్డింగ్ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై టీటీడీ యంత్రాంగంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

'షైనింగ్ స్టార్స్'తో ఉజ్వల భవిష్యత్తు

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



విద్యార్థులకు అవార్డును ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్, పక్కన డీఈఓ సుబ్రమణ్యం, ఇతర అధికారులు

రాయచోటి : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు.. షైనింగ్‌స్టార్స్ అవార్డులు దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ అవార్డులను స్ఫూర్తిగా తీసుకొని గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సుధా ఈవెంట్స్ ఫంక్షన్ హాల్‌లో విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలో పదవ తరగతి, 12వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ''షైనింగ్ స్టార్స్–2025'' అవార్డుల ప్రదా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10, 12వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్స్‌గా ప్రభుత్వంచే గుర్తింపు పొంది జీవితంలో మరొక స్థాయికి ఎదిగారన్నారు.

ఉన్నతికి ప్రతిభా అవార్డు..

అవార్డు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రుల మాటల్లోని సంతోషం చూస్తుంటే తన 12వ తరగతి నాటి జ్ఞాపకాలు గుర్తొచ్చాయన్నారు. 2002లో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు.. ఉమ్మడి రాష్ట్రం హైదరాబాదులో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆరోజు ప్రతిభా అవార్డు అందుకున్న విద్యార్థులలో తాను ఒకడినని చెప్పారు. అవార్డు అందుకున్న రోజు తాను ఐఏఎస్ ఆఫీసర్ అవుతానని అనుకోలేదు. ప్రతిభ ఉన్నప్పుడు మనం ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలి. అప్పుడే కచ్చితంగా చేరుకుంటామని వివరించారు. పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఆ దిశగా ప్రోత్సహిస్తే అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.

221 మందికి అవార్డులు ప్రదానం

జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 221 మంది విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో 185 మంది 10వ తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు, మెడల్, ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి రవి, డీఈఓ సుబ్రమణ్యం, కళాశాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు స్వాధీనం


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే

పీలేరు రూరల్ : దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ హెగ్డే తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. మదనపల్లె టౌన్ చీకలగుట్ట గౌతమి నగర్‌కు చెందిన కావడి సోమశేఖర్ తన దూరపు బంధువు అయిన పీలేరు మండలం యర్రగుంట్లపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన జరుపుల మణిగండన్ ఇతర కేసుల్లో జైల్లో ఉంటూ పరిచయం పెంచుకున్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత ఇద్దరూ కలిసి రాత్రి సమయంలో తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి పగుల గొట్టి ఇంటిలో ఉన్న విలువైన ఆభరణాలు చోరీ చేసేవారు. ఈ క్రమంలో పీలేరు టౌన్, మండలంలో మూడు ఇళ్లలో, కలికిరిలో రెండు ఇళ్లలో, మదనపల్లెలో రెండు ఇళ్లలో చోరీ చేశారు. సోమశేఖర్ గత ఏడాది శ్రీకాళహస్తిలో రెండు ఇళ్లలో చోరీ చేశాడు. ఇతనిపై గతంలో 15 దొంగతనం కేసులు నమోదయ్యాయి. మణిగండన్ గత ఏడాది బోడుమల్లువారిపల్లె మాటచెరువు వద్ద తన భార్యను హత్య చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. నిందితులను సోమవారం స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద అరెస్టు చేసి మొత్తం తొమ్మిది దొంగతనం కేసులకు సంబంధించి వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేష్, సిబ్బంది శ్రీనివాసులు, రాధాకృష్ణ, ఉపేంద్ర, జగదీశ్, తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

మూడు బైకులు ఢీ

- ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- పలువురికి గాయాలు


మృతి చెందిన మోహన కృష్ణ

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట గుండ్లూరు క్రాస్ రోడ్డులో మూడు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బోయనపల్లిలో ఇంజినీరింగ్ చదువుతున్న గుంటూరుకు చెందిన మోహనకృష్ణ(20) మృతి చెందాడు. రామాపురానికి చెందిన ఇద్దరు, చొప్పావారిపల్లికి చెందిన ఇద్దరు, సమీప తోటలో పనిచేసే మరో వ్యక్తి గాయపడ్డారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు


విలపిస్తున్న తల్లి సోహాదేవి

మదనపల్లె రూరల్ : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. బీహార్ రాష్ట్రం పాట్నా నగరానికి చెందిన ఓలాసాయి, సోహాదేవి దంపతులు ఉపాధి నిమిత్తం మదనపల్లె చీకలగుట్ట బాలాజీనగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి జబీర్‌కుమార్ (5) కుమారుడు ఉన్నాడు. కొంత కాలం క్రితం ఓలాసాయి భార్యను వదిలి వెళ్లిపోయాడు. దీంతో సోహాదేవి పట్టణంలోని డీమార్ట్‌లో పని చేస్తూ కుమారుడిని పోషించుకుంటోంది. సోమవారం ఆమె జబీర్‌కుమార్‌ను ఇంటివద్దే వదిలి విధులకు వెళ్లింది. సాయంత్రం 5 గంటలకు ఇంటికి తిరిగి రాగా, కుమారుడు కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికింది. చుట్టుపక్కల వారు జబీర్‌కుమార్ స్థానికంగా ఉన్న మసీదు సమీపంలో ఆడుకుంటూ ఉండగా తాము చూశామని చెప్పడంతో, సోహాదేవి తోటివారితో కలిసి మసీదు వద్ద వెతకగా, అక్కడ ఉన్న నీటి సంపులో జబీర్‌కుమార్ పడి ఉంటాన్ని గుర్తించారు. వెంటనే బయటకు తీసి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన అత్యవసర విభాగం వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో సోహాదేవి కన్నీమున్నీరుగా విలపించింది.

తప్పిన పెను ప్రమాదం

లింగాల : లోపట్నూతల గ్రామానికి చెందిన వెంగళరెడ్డి సోమవారం తన బొలెరో వాహనంలో పులివెందుల నుంచి స్వగ్రామానికి వస్తుండగా, లింగాల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వాహనం అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది.

యువతి ఆత్మహత్య


మస్తానీ మృతదేహం

మదనపల్లె రూరల్ : ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. మంజునాథ కాలనీకి చెందిన దంపతులు గఫూర్, హసీనాలకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తెకు వివాహం జరిపించారు. రెండో కుమార్తె మస్తానీ(16) ఎనిమిదో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్ద ఉంటోంది. గఫూర్ స్థానికంగా హోటల్లో పనిచేస్తుండగా హసీనా గొర్రెలు మేపేందుకు వెళుతుంది. సోమవారం తల్లిదండ్రులు ఇద్దరు వారి పనులకు వెళ్లగా మస్తానీ ఒకటే ఇంట్లో ఉంది. తల్లి హసీనా ఇంటికి వచ్చే సరికి మస్తానీ ఫోన్లో మాట్లాడుతుండగా తల్లి మందలించింది. దీంతో మనస్థాపం చెందిన మస్తానీ బాత్రూం లోకి వెళ్లి గడియ పెట్టుకుంది. తను వేసుకున్న చున్నీతో ఆత్మహత్య చేసుకుంది. ఎంత సేపటికి బాత్రూం నుంచి మస్తానీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లి స్థానికుల సాయంతో తలుపు పగలగొట్టి చూడగా, చున్నీ నుంచి జారి కిందపడి అపస్మారక స్థితిలో మస్తానీ ఉండటాన్ని గమనించి వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు ప్రేమ వివాహమే కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ కృషితో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్


మాట్లాడుతున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్ : సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు రాజంపేటలో స్టాపింగ్ సౌకర్యం ఉండాలన్నది రాజంపేట ప్రాంత ప్రజల ఆకాంక్ష అని, ఆ ఆకాంక్ష పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషి ఫలితంగా ఈనెల 11వ తేదీ నెరవేరుతున్నట్లు గుంతకల్లు రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రైల్వేశాఖ మంత్రిని కలిసి సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు రాజంపేటలో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరడంతో రైల్వే అధికారులు స్టాపింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరికొన్ని రైళ్లను రాజంపేటలో నిలిపేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలు రైళ్ల స్టాపింగ్‌కు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి దృష్టికి తీసుకువస్తున్న కారణంగా ఆయన పెద్దిరెడ్డి, మేడా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్ట్ దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డి.భాస్కర్‌రాజు, వడ్డే రమణ, జీవీ.సుబ్బరాజు, పోలి రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 32వేల మందితో యోగా

కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి


అన్నమయ్య ఉద్యానవనంలో యోగాంధ్రలో కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట : అధ్యాత్మిక కేంద్రమైన అన్నమయ్య ఉద్యానవనంలో ఆసనాలు చేస్తే ఆరోగ్య శాసనాలుగా మారి అందరి జీవితాలు ఆరోగ్యపరంగా మెరుగుపడతాయని కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద వందలాదిమందితో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిగా మార్చుకొని ముందుకెళ్లాలన్నారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 32వేల సంకీర్తనలతో వెంకటేశ్వరస్వామి వారిని మైమరపించారన్నారు. ఆయన పేరుతో మన జిల్లా ఉండటం గర్వకారణమన్నారు. త్వరలో అన్నమయ్య ఆలపించిన 32వేల సంకీర్తనలకు గుర్తుగా 32వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి జిల్లాను ప్రథమస్థానంలో ఉంచుతామన్నారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట సబ్ కలెక్టరు వైఖోమ్‌నైదియాదేవి, ఎఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్ హేగ్డే, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, మాజీ అధ్యాపకులు, సౌకర్యాల దాత ఉద్దండం సుబ్రమణ్యం, తహసీల్దారు పీరుమున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.సానేశేఖర్, ఏవో బాలమునిస్వామి,పీహెచ్‌పీఆర్డీ మూర్తి, వెలుగు ఏపీఎం నాగార్జుననాయుడు, ఏపీలో సాలయ్య,వెటర్నరీ డాక్టర్ భాగ్యవతిలు పాల్గొన్నారు. కాగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించారు.

యోగాతో ఆరోగ్యం.. ఎమ్మెల్యే ఆకేపాటి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. యోగా అలవర్చుకోవడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం కలిగి ఉంటామన్నారు. సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, అరిగె హరి బాబు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాదారులతో పీలేరు సీఐ కుమ్మక్కు


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న పీలేరు సీపీఐ నాయకులు

రాయచోటి : బియ్యం అక్రమ రవాణాదారులతో పీలేరు సీఐ యుగంధర్ కుమ్మక్కు అయ్యాడంటూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ మరికొందరితో కలిసి అధికారుల అవినీతి వారికి మద్దతు తెలుపుతున్న సీఐ గురించి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బియ్యం బస్తాలు హద్దులు దాటిపోతున్నాయన్నారు. పీలేరు సీఐ యుగంధర్ అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వారితో కుమ్మక్కు కాకపోతే ఎందుకు పోలీసులు పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసి సివిల్ సప్లై అధికారులకు అప్పగించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్, రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన నాగరాజు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జల్లా నాగరాజు (50) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని పీఎస్ కాలనీకి చెందిన నాగరాజు రాయచోటిలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో సొంత గ్రామానికి వస్తుండగా చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై యర్రగుంట్ల బస్టాప్ సమీపంలో ఇండికేటర్, ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఆగి ఉన్న లారీని అదుపు తప్పి ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన నాగరాజును స్థానికుల సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కు చనిపోవడంతో భార్య కృష్ణమ్మ, ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో పాటు గ్రామస్తులు శోక సంద్రంలో మునిగి పోయారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం


ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజంపేట టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు తెలిపారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ యూనియన్ రీజనల్ కన్వీనర్ నరసింహులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రమణ్యంరాజు ఎస్టీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తొలి నుంచి ఉపాధ్యాయుల పక్షాన నిలుస్తున్న యూనియన్ ఎస్టీయూ అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు పిల్లి రామకృష్ణ, ఎస్.మురళీ మనోహర్, జి.శ్రీనివాస్‌రావు, స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.